సాక్షి తిరుపతి

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



విశిష్టం.. హైందవ ధర్మం

సనాతన హైందవ ధర్మ ప్రచారానికి టీటీడీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జేఈఓ సదాభార్గవి తెలిపారు. - 8లో



నేడు రేణిగుంట జాతర

గంగమ్మ జాతరకు రేణిగుంట ముస్తాబైంది. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	25
చిత్తూరు	32	24
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

గూడూరురూరల్ : పట్టణంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ప్రవేశానికి మూడో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీరాములు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు http:// iti.nic. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. 30న ఐటీఐలో చేరే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

27న నాయుడుపేటలో అథ్లెటిక్స్

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 27వ తేదీన అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అండర్-6, 8, 10, 12, 14, 16 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 60, 100, 200, 300, 600 మీటర్ల పరుగు పందేలు నిర్వహించి ఐదుగురు విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు వివరించారు. వివరాలకు 94405 51278 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికులకు వేతనాల పెంపు

తిరుపతి రూరల్: వివిధ శాఖల్లోని ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్ విభాగాల వారీగా వేతనాలను ప్రకటించింది. సోమవారం ఈ మేరు జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్ మాట్లాడుతూ రోజుకు 8 పని గంటలను నిర్దేశించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పెరిగిన వేతనాలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసినవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తిరుపతిలో ఈ నెల 29న మహా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందు కోసం 2023లో ఉత్తీర్ణులైన డిగ్రీ విద్యార్థినులకు కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కింద శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

నేడు శివయ్య కల్యాణం

నారాయణవనం: మండలంలోని కైలాసనాథ కోనలో మంగళవారం ధర్మరథంలో విచ్చేయనున్న శ్రీకాళహస్తీశ్వర స్వామికి అభిషేకం, కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ ధర్మప్రచారంలో భాగంగా శ్రీకాలహస్తీశ్వరుని రథం మంగళవారం ఉదయం కైలాసనాథ కోనకు చేరుకుంటుందన్నారు.

బాల శాస్త్రవేత్తలకు 'ఇన్‌స్పైర్'



మాట్లాడుతున్న సీఎంఓ సురేష్

శ్రీకాళహస్తి: బాల శాస్త్రవేత్తలు ప్రతిభను ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ మనక్ చక్కటి అవకాశమని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ సురేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో అన్ని యాజమాన్య పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ మనక్ ఉపయోగపడుతుందన్నారు. ఇందు కోసం నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. హైస్కూళ్ల నుంచి 5 ప్రాజెక్టుల చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 3 ప్రాజెక్టుల చొప్పున ఈ నెల 31వ తేదీ లోపు నామినేషన్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈఓ బాలయ్య, ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, ఉపాధ్యాయులు మేఘనాథ్, సుబ్రమణ్యశర్మ పాల్గొన్నారు.



చిల్లకూరు మండలం కడివేడు రెవెన్యూ పట్రగుంటలోని అసైన్డ్ భూమి

పేద రైతుకు పట్టాభిషేకం



ఈ ఫొటోలోని రైతు పేరు మామిడిపూడి వెంకటేశ్వర్లు. గూడూరు నియోజకవర్గం, వాకాడు గ్రామం. ఈ రైతుకు వాకాడు స్వర్ణముఖి ఏటిగట్టు అవతల 75 సెంట్లు భూమి ఉంది. గత 25 ఏళ్లుగా సొంత పట్టా లేక అవస్థలు పడుతున్నారు. జగనన్న ప్రభుత్వం సొంత హక్కులు కల్పించి ఈ నెలాఖరులో పట్టా ఇవ్వనుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయం దండగంటూ చులకనగా మాట్లాడిన ఘనులు నివ్వెరపోయేలా.. గతంలో సేద్యం చేయలేక తరచూ క్రాప్ హాలిడే పేరుతో కాడిపడేసే అన్నదాత సంబరపడేలా.. నాడు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కక తల్లడిల్లిన కర్షకుడి కష్టం తీరేలా.. అప్పట్లో నష్టాల ఊబిలో చిక్కుకుని పురుగుమందునే పెరుగన్నంగా భావించి ఉసురు తీసుకున్న రైతుల ఆత్మకు శాంతి చేకూరేలా.. వ్యవసాయాన్ని పండుగలా.. సాగును సంబరంలా మారుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తూ విప్లవాత్మకమైన పథకాలు అమలు చేస్తున్నారు. విత్తు నుంచి ఉత్పత్తుల కొనుగోలు వరకు చేయూతనందిస్తున్నారు. ఈ క్రమంలో దశాబ్దాలుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని సంకల్పించారు. సాగు చేసేవారికే సర్వహక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

- అసైన్డ్ భూములకు పట్టాలు
- త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు
- 1,135 మందికి 786.8 ఎకరాలు
- ముమ్మరంగా సర్వే చేస్తున్న అధికారులు
- దశాబ్దాల సమస్యకు పరిష్కారంపై సర్వత్రా ప్రశంసలు

తిరుపతి అర్బన్ : రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండదండలు అందిస్తోంది. అందులో భాగంగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు మేలు చేకూర్చే దిశగా ముందడుగు వేసింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు డీ పట్టా (దరఖాస్తు పట్టా) మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు లబ్ధిదారులకు రైతు భరోసా పథకం వర్తింపు, బ్యాంకు రుణాలు అందించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులు ముమ్మరంగా సర్వే చేపట్టారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 786.8 ఎకరాల అసైన్డ్ భూములను గుర్తించారు. వాటిని సాగు చేసుకుంటున్న మొత్తం 1,135 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అర్హులైన పేద రైతులందరికీ లబ్ధి చేకూర్చే దిశగా కసరత్తు చేస్తున్నారు. అతి త్వరలోనే మొత్తం ప్రక్రియను పూర్తి చేసి సాగు చేసుకుంటున్న వారికి సర్వహక్కులు కల్పించనున్నారు.



తిరుపతి కలెక్టరేట్

అర్హులందరికీ న్యాయం



జిల్లాలో అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం న్యాయం చేయనుంది. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నప్పటికీ హక్కులు పొందని వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. ఈ మేరకు పకడ్బందీ కసరత్తు చేస్తున్నాం. పట్టాలు అందించిన తర్వాత వారికి ప్రభుత్వ పథకాలు అన్నీ వర్తిస్తాయి. బ్యాంకు రుణాలు సైతం పొందవచ్చు.

– కోదండరామిరెడ్డి, డీఆర్ఓ, తిరుపతి

పట్టాల పంపిణీ వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
గూడూరు	04	5.89
చిల్లకూరు	151	122.53
కోట	33	33.3
వాకాడు	215	131.23
చిట్టమూరు	130	50.3
బాలాయపల్లె	58	69.57
వెంకటగిరి	59	73.21
డక్కిలి	183	69.57
ఓజిలి	28	17.97
పెళ్లకూరు	06	8.66
దొరవారిసత్రం	36	24.81
సూళ్లూరుపేట	38	26.68
తడ	60	37.53
బీఎన్ కండ్రిగ	15	7.54
కేవీబీపురం	59	46.51
పిచ్చాటూరు	11	4.97
నారాయణవనం	04	8.69
చంద్రగిరి	24	15.59
పాకాల	07	15.15
ఎర్రావారిపాళెం	05	7.49
చిన్నగొట్టిగల్లు	09	9.61

'పాస్‌పోర్టు'కు మౌలిక వసతులు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్: తిరుపతి పాస్‌పోర్టు కార్యాలయంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతామని ఎంపీ గురుమూర్తి భరోసా ఇచ్చారు. సోమవారం ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా పాస్‌పోర్ట్ ఆఫీస్ వద్ద షెల్టర్ లేకపోవడం వల్ల ఎండలోనే నిలబడాల్సి వస్తోందని పలువురు తెలిపారు. వర్షాకాలంలో డాక్యుమెంట్లు తడిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీ వెంటనే పాస్‌పోర్టు ఆఫీస్ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి పాస్ పోర్ట్ సేవా కేంద్రం రాయలసీమ నాలుగు జిల్లాలకు విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. ఇటీవల రద్దీ పెరిగిపోవడంతో అందుకు తగ్గట్టు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనిపై వారంలోపు రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్, టీసీఎస్ అధికారులు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళతామని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,444 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.21 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

న్యాయవాదుల సంఘం భవన పనులు ప్రారంభం



పుంగనూరులో న్యాయవాదుల భవన పనులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘ భవన నిర్మాణ పనులను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి సోమవారం ప్రారంభించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, న్యాయవాదులు కలసి మంత్రి పెద్దిరెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. మంత్రి పెద్దిరెడ్డి భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా న్యాయవాదులు ఐకమత్యంతో ఉండడం అభినందనీయమన్నారు. న్యాయవాదుల కోరిక మేరకు ఈ భవనం నిర్మించేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి నిధుల నుంచి రూ.25 లక్షలు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, న్యాయవాదులు ఆనందకుమార్, ఆకుల చెన్నకేశవులు, సుధాకర్ రెడ్డి, బాలాజీకుమార్, మల్లికార్జునరెడ్డి, హితేంద్ర, విజయకృష్ణ, అయూబ్, రవీంద్రరెడ్డి, హరినాథ రెడ్డి, పులిరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో కాదు.. చేతల్లో అభివృద్ధి

- మిట్టపాళెంలో రూ.90 లక్షల పనులు ప్రారంభం
- జగనన్న సుపరిపాలనకు సాక్ష్యాలు
- మంత్రి ఆర్‌కే రోజా



ప్రారంభించిన భవనాల ముందు మంత్రి ఆర్‌కే రోజా

నగరి: అభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో చూపుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మండలంలోని మిట్టపాళెంలో సోమవారం ఒకే ప్రాంగణంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఎన్ఆర్ఈజీఎస్, రూ.20.8 లక్షల ఎన్‌హెచ్ఎం నిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, స్వచ్ఛభారత్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, జిల్లా పరిషత్ నిధులు రూ.2.5 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లను ఆమె ప్రారంభించారు. ఇంతటి అభివృద్ధిని తమ గ్రామానికి చేసిన మంత్రికి స్థానిక మహిళలు కర్పూర హారతులు పట్టారు. గజమాలలతో సత్కరించారు.

కళ్లెదుటే అభివృద్ధి

గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేస్తూ ప్రజలను ఏమార్చిందని మంత్రి రోజా గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు ప్రత్యక్షంగా ప్రజలకే చూపుతోందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో రూ.90 లక్షల మేర అభివృద్ధి పనులు ప్రారంభించామని చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే పాలనను జగనన్న తీసుకొచ్చారని చెప్పారు. గ్రామంలోని రైతులకు పరిపాలనకు సచివాలయం, వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య రక్షణకు వెల్‌నెస్ సెంటర్, తాగునీటి సరఫరాకు బోరు, ఈ కేంద్రాలకు విచ్చేసే వారి సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ఒక ప్రాంగణంలో ఉందంటే ఇది నిజమైన అభివృద్ధి అన్నారు. సచివాలయ పరిధిలోని మేళపట్టు, మిట్టపాళెం గ్రామస్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అభివృద్ధి పనులు, భవనాలన్నీ ప్రజలమీద జగనన్నకు ఉన్న ప్రేమాభిమానాలకు సాక్ష్యాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్, జెడ్పీ నిధులు, ఎమ్మెల్యే నిధులు, గడపగడపకు నిధులు అంటూ సుమారు రూ.కోటి మేర అభివృద్ధికి వినియోగిస్తున్నామని తెలిపారు. ఇలా మంచి చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీడీఓ లీలామాధవి, పీఆర్ డీఈ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్ కుమార్, సీడీపీఓ కృష్ణవేణి, ఎంఈఓ శ్రీదేవి, ఏఈలు సురేంద్రబాబు, శైలేంద్ర, వైద్యాధికారి రమేష్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శననాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ పరంధామన్, ఏఈలు జ్ఞానకుమార్, మురుగానందన్, నాయకులు వినోద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గరుడ పంచమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి తిరుమలలో గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. - తిరుమల

క్యాన్సర్ బాధితుడికి భరోసా



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట : ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రేణిగుంట మండలంలోని గాజులమండ్యం పంచాయతీ దేశమ్మ నగర్‌లో పర్యటిస్తుండగా శీను అనే క్యాన్సర్ పేషెంట్ సాయం కోసం వేడుకున్నాడు. ఆయన తక్షణమే స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల నగదు అందించారు. బాధితుడి కుటుంబీకులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సంధ్య, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

24లోపు అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : దరఖాస్తు జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే, ఈ నెల 24 వ తేదీ లోపు తెలపాలని జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారిణి పద్మజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా చిత్తూరు ఉపాధి కార్యాలయం నోటీస్ బోర్డులో పెట్టినట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న రికార్డు అసిస్టెంట్ 2 పోస్టులకు అర్హతగా ఇంటర్ ఉత్తీర్ణత , అటెండర్ 07, ఆఫీస్ సబార్డినేట్ 01 పోస్టులకు ఇంటర్ ఫెయిల్ విద్యార్హతగా మార్చినట్లు తెలిపారు. అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా అందజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతపై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ : సామాజిక సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత అనే అంశంపై శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ టీ.చైతన్య పాల్గొని విద్యార్థినుద్దేశించి మాట్లాడారు. సమాజంలో సామాజిక సంబంధ బాంధవ్యాలు మెరుగుపడాలంటే సత్సంబంధాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో ఇది చాలా అవసరమని చెప్పారు. దీనికోసం వ్యక్తిగతంగా, కుటుంబ, సామాజికపరంగా కొన్ని పరిధులు ఏర్పర్చుకుని ఒకరిని ఒకరు గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్స్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, వీ.ప్రీతి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికే అదాలత్



న్యాయమూర్తి కరుణకుమార్

శ్రీకాళహస్తి: కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కరుణకుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని కోర్టు భవనంలో పలుశాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. న్యాయమూర్తి మాట్లాడతూ సెప్టెంబరు 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ పాల్గొన్నారు.

24న చిత్తూరులో వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: మద్యం తరలిస్తూ చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రూరల్ పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈనెల 24వ తేదీ వేలం పాటలో విక్రయించనున్నట్లు సీఐ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మిట్టూరులోని ఎస్ఈబీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనేవాళ్లు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఇండికా కారును వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

చేపపిల్లలొచ్చేశాయ్

- తొలి దశలో జిల్లాకు 70లక్షల పిల్లలు
- రెండో దశలో 1.3కోట్ల చేపపిల్లలు
- తూర్పు గోదావరి జిల్లా నుంచి దిగుమతి
- తిరుపతి, కల్యాణిడ్యామ్, అరణియార్‌లో పెంపకం
- అక్టోబర్‌లో 572 చెరువులకు చేపపిల్లలు
- 100 సొసైటీ చెరువులకు తొలి ప్రాధాన్యత



కల్యాణిడ్యామ్ వద్ద ఏర్పాటు చేసిన తొట్టెల్లో చేపపిల్లలను వదులుతున్న మత్స్యశాఖ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాకు రెండు రోజుల క్రితం తొలి దశలో 70లక్షల చేపపిల్లలు తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చాయి. రెండో దశలో 1.30కోట్ల చేపపిల్లలను తీసుకురానున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కట్ల, రొగు, మృగాల రకాలకు చెందిన చేపపిల్లలను తెప్పించారు. 40–50 రోజులు జాలర్ల సమక్షంలో వీటిని సంరక్షించిన తర్వాత అక్టోబర్ నెల మొదటి వారం నుంచి జిల్లాలో 572 చెరువుల్లో వీటిని వదులుతారు. తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో 15లక్షలు, అరణియార్ ప్రాజెక్టు సమీపంలోని చేపల తొట్టెల్లో 25లక్షలు, కల్యాణి డ్యామ్ వద్ద చేపల తొట్టెల్లో 30లక్షలు చేపపిల్లలను వదిలిపెట్టారు. రెండో దశలో భాగంగా ఈ నెల 20న తిరుపతిలో 30లక్షలు, అరణియార్‌లో 40లక్షలు, కల్యాణి డ్యామ్ వద్ద 60లక్షల చేపపిల్లలను వదిలిపెట్టారు. అలాగే వాటికి మేతగా వేయడానికి అవసరమైన బియ్యం పొట్టు, వేరుశనగ పిండిని సిద్ధం చేసి చేపల తొట్టెల వద్ద నిల్వ చేసి ఉంచారు.

572 చెరువుల ఎంపిక

జిల్లాలో 572 చెరువుల్లో చేపలను వదిలిపెట్టడానికి మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే గుర్తించారు. వాటిలో 102 చెరువులు సొసైటీలకు, (మత్స్యకార సొసైటీ పరిధిలోనివి), మరో 470 చెరువులు ఇరిగేషన్‌కు చెందినవి ఉన్నాయి. తొలి ప్రాధాన్యత మత్స్యకారుల సొసైటీలకు చెందిన 102 చెరువుల్లో చేపపిల్లలను వదిలిపెట్టనున్నారు. తర్వాత ఇరిగేషన్ చెరువుల్లో వదులుతారు.

ఆయకట్టుకే 50శాతం ఆదాయం

సొసైటీలు మినహా మిగిలిన చెరువుల్లో చేపల ఆదాయంలో 50శాతం ఆయకట్టుకు కేటాయించాల్సి ఉంది. ఆ ఆదాయం ద్వారా చెరువు కట్టలు, కలుజులు, వరవ కాలువలు, చెక్ డ్యామ్‌లు, తూముల మరమ్మతులు, నూతన నిర్మాణాలకు, మరో 30శాతం ఆదాయాన్ని చెరువుల పరిధిలోని పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలి. ప్రధానంగా గ్రామంలో వీధిలైట్లు, తాగునీరు, బోర్లు, రోడ్లు తదితర వాటికి ఖర్చు చేయాలి. సొసైటీలకు చెందిన చెరువుల ఆదాయాన్ని వాటి పరిధిలోని సభ్యులు 80 శాతం వినియోగించుకుంటారు. మిగిలిన 20శాతం ఆదాయాన్ని మాత్రమే మత్స్యశాఖకు చెల్లిస్తారు.

మత్స్యశాఖ జిల్లా సమాచారం

చెరువుల సొసైటీలు	:	63
చెరువుల సొసైటీలలో సభ్యులు	:	5470
సముద్రపు చేపల సొసైటీలు	:	21
సముద్రపు చేపల సభ్యులు	:	3393
మత్స్య మిత్ర సొసైటీలు (మహిళలు)	:	17
మహిళా సభ్యుల సంఖ్య	:	1889
సొసైటీ చెరువులు	:	102
ఇరిగేషన్ చెరువులు	:	470
ఫిష్ ఆంధ్ర యూనిట్లు	:	150
ఫిష్ ఆంధ్ర రుణాలు	:	రూ.లక్ష నుంచి 50లక్షలు
చేపపిల్లల పెంపకం కేంద్రాలు	:	3

మత్స్య సంపద పెంచడమే ధ్యేయం



జిల్లాలో మత్స్య సంపదను పెంచడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. తిరుపతి జిల్లా ఆవిర్భావంలో ఇతర ప్రాంతాలు కలపడం వలన జిల్లాకు సముద్రం వచ్చినట్టైంది. ఈ క్రమంలో ఫిష్ ఆంధ్రా ద్వారా రూ.లక్ష నుంచి రూ.50లక్షల మేరకు 40శాతం సబ్సిడీతో రుణాలు ఇప్పించి మత్స్యకారులతోపాటు ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నాం. జిల్లాలోని అన్ని చెరువులకు చేపపిల్లలను వదిలి ఉపాధి కల్పించడానికి 2 కోట్ల పిల్లలు తెప్పిస్తున్నాం. అలాగే జిల్లాలో ఉన్న మత్స్యకారుల సొసైటీలలో సభ్యులుగా చేర్చడానికి ఎస్సీ,ఎస్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీనివాస నాయక్, మత్స్యశాఖ జిల్లా అధికారి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,150
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,402

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,700
రిటైల్ వెండి గ్రాము	రూ.74.70

310 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తడ: అక్రమంగా తరలిస్తున్న 310 బస్తాల తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యాన్ని తిరుపతి విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయ్ డీటీ బీ.ఓబయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో చేనిగుంట గ్రామం సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా వెళుతున్న లారీని తనిఖీ చేయగా అందులో రూ.4.82 లక్షల విలువ చేసే 310 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యం కనిపించింది. దీంతో ఏ–1 ముద్దాయిగా ఉన్న బియ్యం వ్యాపారి విజయ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకోవడంతోపాటు లారీ ఓనర్ ఎస్‌కే.జమాల్‌బాషా, మరో ఇద్దరు వ్యాపారులు ఎం.ప్రసాద్, సిద్దారెడ్డిపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ బియ్యం కొండూరులోని సివిల్ సప్లయ్ గోదాములో భద్రపరిచారు.

నేడు రేణిగుంట గంగ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

రేణిగుంట: రేణిగుంట గంగ జాతర మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. జాతర మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, అమ్మవారి దర్శనార్థం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. మంగళవారం జాతర మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణమే కాకుండా పట్టణంలోని ప్రధాన వీధుల్లో దేవతామూర్తుల ప్రతిమలతో కూడిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.



ఆలయం ఎదుట ఏర్పాట్లు

అమ్మవారు

పటిష్టమైన బందోబస్తు



రేణిగుంట జాతర మహోత్సవంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. రెండు రోజులు ఇతర స్టేషన్ల నుంచి కూడా పోలీసు సిబ్బందిని ఇక్కడ జాతర సందర్భంగా విధులకు కేటాయించాం. ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపు, పట్టణంలో ట్రాఫిక్ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ ప్రజలు, భక్తులు పోలీసులకు సహకరించాలి. - భవ్యకిషోర్, డీఎస్పీ, రేణిగుంట

విశిష్టం.. హైందవ ధర్మం



మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ సదాభార్గవి

తిరుపతి కల్చరల్ : ప్రపంచంలోని అన్ని ధర్మాల్లో సనాతన హైందవ ధర్మం విశిష్టమైందని టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. సోమవారం తిరుపతి ఎస్వీయూ స్టేడియంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం రథ యాత్రను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సనాతన హైందవ ధర్మప్రచారానికి టీటీడీ పెద్దపీట వేస్తోందన్నారు. మహా యజ్ఞం రథాలు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో 2024 జనవరి 20వ తేదీ వరకు విస్తృత ప్రచారం చేస్తాయని వెల్లడించారు. అనంతరం తిరుమలలోజనవరి 21న కోటి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందుకోసం టీటీడీ రూ.1.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీహనుమాన్ దీక్ష పీఠం స్వామీజీ దుర్గాప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవులు, డీపీపీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి



శ్రీపాదరావు (ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకుడుగా విధులు నిర్వహిస్తున్న శ్రీపాదరావు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఇంటి వద్ద ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అర్చకుడి మృతికి ముక్కంటి ఆలయ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

మహిళ ఆత్మహత్య

నాయుడుపేటటౌన్ : మండలంలోని మందబైలులో ఆదివారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన మౌనిక(24)ను పెళ్లకూరు మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన కలవకుండ రమేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప ఉంది. కొద్దిరోజులుగా మౌనిక అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఈ క్రమంలో వారం క్రితం మందబైలులో పుట్టింటికి వచ్చింది. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది చేతి గాజులను పగులగొట్టుకుని మింగేసింది. కుటుంబీకులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తల్లి తుపాకుల సూరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

21ఎస్ఎల్‌పి61: మౌనిక మృతదేహం

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

తిరుపతి క్రైం: నగరంలోని ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసుల కథనం.. చెన్నైకి చెందిన అరుణ్‌గణేష్(41) శనివారం అజంతా లాడ్జీలో తమ సమీప బంధువులు వస్తున్నారని రూమును అద్దెకి తీసుకున్నాడు. అయితే రూము తీసుకున్నప్పటి నుంచి అతను బయటకు రాకపోవడంతో రూమ్ బాయ్‌కి అనుమానం వచ్చింది. సోమవారం ఉదయం తలుపులు తట్టగా.. ఎంతకూ తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతను ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి చిరునామా సేకరించి వారి బంధువులకు సమాచారం అందించారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం



ప్రమాదానికి గురైన వాహనం

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ టెంపో అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొంది. వివరాలు.. తమిళనాడుకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం టెంపో ట్రావెలర్‌లో తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం కిందకు దిగుతుండగా 13వ మలుపు వద్ద ప్రమాదం జరిగింది. దీంతో వాహనంలోని ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు.